తనకి సుపరిచితమైన ఉరుములాంటి ఆ గొంతు వింటూనే తుళ్ళిపడి పక్కకి చూసింది చుక్కమ్మ.

ఎదురుగా వీరయ్య. తన భర్త!

మార్కెటింగ్ యార్డ్ ఆఫీసు గది కౌంటర్ దగ్గర నిల్చుని క్లర్కు అందించిన వంద రూపాయల కట్టలు లెక్కపెట్టుకుంటున్న వాడల్లా గబాల్న తల ఎత్తి గబగబా భార్య దగ్గరకి వచ్చాడు.

చుక్కమ్మ ఉబికి వస్తున్న కన్నీళ్ళు ఆపుకుంటూ మెల్లిగా భర్త వెనక్కు వచ్చి నిల్చుంది. ఆ క్షణంలో వీరయ్యని చూస్తే భయం అనిపించలేదు. కొండంత ధైర్యం వచ్చింది.

"ఏంటయ్యా సంగతి?" అంటూ పోలీసుని జమాయించాడు వీరయ్య.

"గేటు కట్టకుండా మునక్కాయలు అమ్ముతూంది." వీరయ్య ఆశ్చర్యంగా పెళ్ళాం కేసి చూశాడు.

"అవునా? ఏందే.... అమ్మింది?"

చుక్కమ్మ చప్పున తల దించుకొంది.

తట్టలో ఉన్న మునక్కాడలు, అవిసె పువ్వు చూడగానే వీరయ్యకి సంగతి అర్థమైంది.

"అలాగా! చూడు పటేలాయన! ఆమెకి తెల్వదనుకో. నెమ్మదిగా చెప్పాలి గాని గట్లనేనా కసిరేటిది? నడుమ్ ఎంత కట్టాలో కడతా" అంటూ కౌంటర్ దగ్గరికి వెళ్ళాడు పోలీస్ పక్కనే ఉన్న కుర్రాడు కాగితం మీద రాసి చింపి వీరయ్యకి ఇచ్చాడు.

పెనాల్టీతో కలిపి పది లోపే.

ఈపాటిదానికి అంత రాద్ధాంతం చెయ్యాల్నా? నెమ్మదిగా చెప్తే పోలే?" వీరయ్య కోపంగా చూసి ఆఫీసు గది కౌంటర్ దగ్గరికి వెళ్ళి డబ్బు కట్టి వచ్చాడు.

చుక్కమ్మ బితుకు బితుకు మంటూ తట్ట పట్టుకుని స్తంభం చాటుకి నక్కి కూర్చుంది. పావు గంటలో వీరయ్య చుక్కమ్మ దగ్గరికి వచ్చాడు.

"ఏంటే నువ్వు చేసిన నిర్వాకం? ఇంటి పనులు చక్కంగా చూసుకోలేవు గాని సంతలో కూరగాయ లమ్ముతావ్? ఒక్క రోజులో సంపాయించి సిల్కు కోక కొనేసుకుందామనే? పొద్దుట్నుంచి కూసుంటే ఏ మాత్రం వచ్చిందేం?" అన్నాడు ఎగతాళిగా.

అతని మాట పరుసుగా ఉన్నా కళ్ళు నవ్వుతున్నాయ్. కంఠం మెత్తగా కరుగుతున్నట్లు ఉంది.

"......."

"నే నా సమయానికి అక్కడ ఉండబట్టి సరిపోయింది గాని లేకుంటే ఏమయ్యుండేదానివి?"

చుక్కమ్మ ఒకసారి తలెత్తి వీరయ్య మొగం లోకి చూసి మళ్ళీ తల దించుకుంది. భర్త మొగంలో చిరు నవ్వు చూడగానే ధైర్యం వచ్చింది చుక్కమ్మకు.

"ఎరువు కొందామంటే నా చేతిలో చిల్లి గవ్వ లేదు. ఇయ్యాళ మన పురి లోంచి ధాన్యం తీసి పదిహేను బస్తాలు అమ్మాను. రేపు ఒంగోలు వెళ్ళి ఓ గిత్తల జత కూడా తెద్దా మనుకొంటున్నాను. అట్లాగే నిన్ను పట్నం తీసుకుపోయి ఓ సిల్కు కోక ఇప్పిద్దామనుకున్నాను. కాని ఏది? అప్పుడే రోడ్డు మీద పడితివి. నాలిగేళ్ళ సంది తిండి పెట్టి నిన్ను సాకటం లేదే? రేపట్నుంచి పిల్లగాడ్ని కూడా సాకాలాయే. లేకుంటే నీ సంపాదనతోనే అట్టి సాకుతావా?" మేల మాడాడు.

చుక్కమ్మ సిగ్గుల మొగ్గ అయ్యింది.

"ఛీ... పో... నీ కన్ని వరాచికాలే" అంటూ మొగం తిప్పుకొంది.

చిలకాకు పచ్చ రంగు అంచుతో ఎర్రటి సిల్కు కోక, పోలేరమ్మ సంబరం కళ్ళ ముందు కదులుతుంటే పకపక నవ్వింది. ★

మినీకథ

# ఆగడు! ఆనిముషమాగడు!

రావులపాటి రాజీవ్‌చంద్ర

అది ఎన్నేసారో చెప్పలేం కానీ ఓ రాత్రి సమయంలో హఠాత్తుగా అప్పారావుగారికి గుండెపోటు వచ్చింది. మాది అసలే ఒక్క సిమెంటు ఇల్లు కూడా లేని కుగ్రామం. అలాంటిది ఉన్నట్టుండి ఆ రాత్రివూట డాక్టర్‌ని ఎలా పుట్టించగలం?

చేసేది లేక పాపం వారికి నాటు వైద్యంతో అప్పటికి సర్దుకునేట్లు చేశాం. కానీ ఎట్టి పరిస్థితుల్లో అయినా వారిని ఇంకో రెండు గంటల్లో పక్క ఊరికి తీసుకెళ్ళి వైద్యం చేయించకపోతే వారికి పరలోకదర్శన ప్రాప్తి కలుగుతుందన్న విషయం విదితమే

ఈ విషయం అర్థం చేసుకున్న గ్రామ ప్రముఖులంతా నా వైపు చూడసాగారు. వా రలా నా వైపు చూడటానికి కారణం నేనొక ప్రముఖవ్యక్తిననీ, నా సలహా తీసుకోవటానికే మాత్రం కాదు. వారి ఉద్దేశమల్లా, ముప్పై కిలోమీటర్ల దూరం ఉన్న పక్క ఊరికి నేను నా స్కూటర్ మీద అప్పారావుగారిని తీసుకెళ్ళి వైద్యం చేయించటానికి సమ్మతిస్తానా, లేదా అని.

సైకిలు తొక్కటమే మహా పాపమైన ఆ గ్రామంలో స్కూటర్ వంటి వాహనమున్నది నా ఒక్కడికే నిజం చెప్పాలంటే వారానికి మూడు కిలో మీటర్లు కూడా స్కూటర్‌మీద తిరగవలసిన అవసరం నాకు లేకపోయినా, ఏదో సరదాపడి నే నా స్కూటర్ కొనుక్కొని నెల కోసారో, రెండుసార్లో పక్క ఊరికి వెళ్ళి సినిమా చూసి వస్తూ ఉంటాను. అలాంటిది ఇప్పుడు, కొన్న తరువాత మొట్టమొదటిసారిగా నా స్కూటర్ నిజంగా ఉపయోగకరం కాబోతున్నందుకు నాకు చాలా సంతోషమనిపించింది.

కానీ అప్పారావుగారిని తీసుకెళ్ళటంలో నా కొక చిక్కుంది ఆ చిక్కల్లా నాకు స్కూటర్ సరిగ్గా నడపటం రాకపోవటం మాత్రం కాదు. నేను ఎంత రద్దీ అయిన ప్రదేశంలోనైనా యాభై కిలోమీటర్ల వేగానికి తగ్గకుండా నడపగల సమర్థుడినే

నాకున్న చిక్కేమిటో కొందరు గ్రామ ప్రముఖులను పక్కకు తీసుకెళ్ళి చెప్పి "మీ రేమీ అధైర్యపడకండి. మనందరికీ ఆప్తులైన అప్పారావుగారిని కాపాడటానికి నే నామాత్రం సహాయం చేయలేనా?" అని ఒక డైలాగు వదలి అప్పారావుగారిని నా స్కూటర్ వెనుక సీటు మీద కూర్చోబెట్టుకుని, నన్ను గట్టిగా పట్టుకొమ్మని వారికి సలహా ఇచ్చాను.

నేను బయలు దేరబోయేముందు, నేను చేయబోయే త్యాగానికి తమ కళ్ళు చెమ్మగిల్లగా నాకు వీడ్కోలు తెలిపారు మా గ్రామ ప్రజలు.

బయలు దేరిన తరువాత కానీ నేను గ్రహించలేదు ఆ రోజు అమావాస్య అని. ఆ సంగతి గుర్తుకొచ్చి కూడా నేను నా ధైర్యాన్ని దిగజార్చుకోలేదు.

పట్టువదలని విక్రమార్కుడిలా ఆ అమావాస్యనాడు, ఆ అర్థరాత్రివూట, ఒక్క స్ట్రీట్ లైట్‌కి కూడా నోచుకోని ఆ మట్టిరోడ్డుపైన, వచ్చే పోయే ప్రతి వాహనం ఒక గండంలా తయారవ్వగా, వాటన్నిటినీ దాటుకుంటూ, అరవై కిలో మీటర్ల స్పీడుతో అర్థ గంటలో పక్క ఊరు చేరుకొని జనరల్ హాస్పిటల్ ముందు స్కూటరాపి, అప్పారావుగారిని హాస్పిటల్లో ఎడ్మిట్ చేసి అంతా సుఖాంతమే - అనుకొని ఒక్కసారి తేలికగా ఊపిరి పీల్చుకున్నాను.

** ** **

మరునటి రోజు డాక్టర్ని కలుసుకోగానే అతడు నాతో "ఇంకో పావు గంట ఆలస్యమై ఉన్నా వారు మీకు దక్కేవారు కాదు. రియల్లీ యూ ఆర్ వెరీ లక్కీ," అన్నాడు.

అలా అతను నాతో చెప్పటం రాత్రి నుంచి అది పదవసారి కావటంతో నేను అతని మాటలని ఏ మాత్రం పట్టించుకోకుండా అప్పారావుగారి బెడ్‌ని చేరుకున్నాను.

అప్పటికి వారు ఎంతో తేలికపడ్డారు. నా వైపు ఎంతో కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ "నీ మేలు ఈ జన్మలో మరువలేను" అని పలికి ఒక ధర్మ సందేహాన్ని వెలిబుచ్చారు.

వారు పక్క మీద కాస్త సర్దుక్కూర్చుని, "నీవు నిన్న రాత్రి అంతటి చీకట్లో కూడా అంత వేగంగా నడపగలవని నే నూహించలేదు. నీవు నిజంగా స్కూటర్ నడపటంలో ఇంత ప్రావీణ్యం గల నువ్వు నిన్న రాత్రి అందరిని పక్కకు తీసుకెళ్ళి నీ కేదో చిక్కు సమస్య ఉన్నదన్నావని విన్నాను. ఏమిటోయ్ అది?" అన్నాడు.

నేను ఆ ప్రశ్నకు సమాధానంగా, "ఏదో దేముడి దయవల్ల మీరు ప్రమాదం నుంచి బైట పడ్డారు. నా కదే ఎంతో ఆనందంగా ఉంది. ఇక పోతే నా చిక్కు సమస్యేమిటంటే నాకు చిన్నప్పటి నుంచీ 'రేచీకటి' వ్యాధి ఉంది" అని అన్నాను.

అంతే అప్పారావుగారి గుండె ఆగిపోయింది

## లీడర్

'మాదెంత పెద్ద పార్టీయో! నేనే లీడర్ని. నేను ఎలా చెబితే అలా నడుచుకోవలసిందే అందరూ.'

'అబ్బా...ఏం పార్టీ ఏది.'

'బాండ్‌మేళం పార్టీ!'

-కె.వి.మధుసూదనరావు